క్లుప్తంగా

నేడు పోతునూరులో 'జగనన్న సురక్ష'

దెందులూరు: పోతునూరులో సోమవారం ఉదయం స్వరాజ్ భవనంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమంలో ఉంటారని గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బోదుల స్వరూప్ కోరారు.

మణిపూర్ సంఘటనపై గిరిజన సంఘం నిరసన



నాగులదేవునిపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్ఆర్ ఫౌండేషన్ గిరిజన సంఘం సభ్యులు

దెందులూరు: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటన ప్రజాస్వామ్యానికి మానవ హక్కులకు మాయని మచ్చని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం విచారకరమని గిరిజనుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బండి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నాగులదేవునిపాడు బీఎస్ఆర్ ఫౌండేషన్ మండల గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన సంఘం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు మాదిరిగా భారత రాష్ట్రపతి జోక్యం చేసుకుని ఘటనలో బాధ్యులు, ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో గిరిజన సంఘం సభ్యులు నాగమణి, దుగ్గిరాల మరియమ్మ, కందుల రాజు, దుగ్గిరాల వెంకటేశ్వరరావు, కందుల దుర్గ, ఆదిలక్ష్మి, వినయ్, రాములు ఉన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్



పెదపాడులో కోళ్ల వ్యర్థాల వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు

పెదపాడు: అక్రమంగా కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం ఉదయం పెదపాడు గ్రామం వైపుకు కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో కలిసి అడ్డుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

పేకాట స్థావరంపై ఎస్ఈబీ అధికారుల దాడి

పెదవేగి : పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం నడిపల్లిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఈబీ ఎస్సై సుబ్బారెడ్డి తన సిబ్బందితో దాడి చేయగా, ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12,570 నగదు, 5 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని పెదవేగి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు ఎస్సై లక్ష్మణ్ చెప్పారు.

సీఎం జగన్‌కు కొప్పువెలమలు రుణపడి ఉంటారు



జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులను సత్కరిస్తున్న కొప్పు వెలమ సంఘ నాయకులు

ఏలూరు (టూటౌన్) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కొప్పువెలమలు ఎంతో రుణపడి ఉంటారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఏలూరు నగరంలో కొప్పు వెలమ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో కొప్పు వెలమలకు తగిన గుర్తింపు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా, మంత్రిగా పదవులను కట్టబెట్టిన సీఎం తాజాగా గోదావరి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని తొలిసారిగా అవకాశం కల్పించారన్నారు. కొప్పు వెలమలు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయడం ద్వారా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, మాజీ మంత్రి మరడాని రంగారావు, మూడెడ్ల రంగారావు, అల్లు ఉమామహేశ్వరరావు, ఆర్నేపల్లి మధు, బల్లా శివ, మరడాని అచ్యుతరావు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటి పంపిణీ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- రూ.1.15 కోట్లతో పీఎన్ కొలను, డి.గోపవరంలో అభివృద్ధి పనులు



పెదనిండ్రకొలనులో మైక్రో ఫిల్టర్ పనుల ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం పెదనిండ్రకొలనులోని రక్షిత మంచినీటి పథకం వద్ద జిల్లా పరిషత్ నిధులు రూ.35 లక్షలతో ఏర్పాటు చేస్తున్న 1.5 ఎంఎల్‌టీ కెపాసిటీ మైక్రో ఫిల్టర్ పనుల ప్రారంభంతో పాటు, జల్‌జీవన్ మిషన్‌లో రూ.40 లక్షల నిధులతో పూర్తయిన పైప్‌లైన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం దేవరగోపవరంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారుల ప్రారంభోత్సవంతో పాటు, జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వాసుబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న జెడ్పీటీసీ కోడే కాశి మాట్లాడుతూ రూ. కోటి వరకూ జెడ్పీ నిధులతో మండలంలోని బువ్వనపల్లి మంచినీటి చెరువు, నిడమర్రు సీసీ రహదారులు, మండలపర్రు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్ ముగ్గళ్లయాకోబు, వైస్ ఎంపీపీ బండి రమణ విస్సాకు, ఎంపీటీసీ చినిమిల్లి నరసింహమూర్తి, పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు దాట్ల శివవర్మ, నీటి సంఘం అధ్యక్షుడు అల్లాడి అబ్బులు, దేవస్థానం చైర్మన్ కోడే ఆంజనేయులు, సొసైటీ మాజీ అధ్యక్షుడు వేగేశ్న వెంకట సుబ్బరాజు చినిమిల్లి శ్రీనివాసు, మాజీ సర్పంచ్ నక్కా రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ ఆవాల రాంబాబు, సొసైటీ డైరెక్టర్ బెవర రాంబాబు, మాజీ ఎంపీటీసీ కొంచాడ గోవిందరావు, పుప్పాల కొండయ్య సాదరులు, కొడవర్తి కృష్ణ, విప్పర్తి మధు, మాదాసు చినసుబ్బారావు తదితరులున్నారు. దేవరగోపవరంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మూరి నారాయణమ్మకృష్ణారావు, ఉపసర్పంచ్ కందులపాటి మహేష్, పార్టీ అధ్యక్షుడు మద్దిరాల బుజ్జి, చోడగిరి నాగబాబు, తుమ్మూరి శ్రీనివాసరావు, మద్దిపట్ల సుబ్బయ్య, బలే శ్రీను, కేసన శ్రీను తదితరులున్నారు.

సేవకు సలాం

వలంటీర్లకు వందనం



పింఛను అందజేస్తున్న వలంటీర్ కొత్తపల్లి జ్యోతి

దెందులూరు: వలంటీర్ల ద్వారా ప్రభుత్వం పేదలకు అందించే పెన్షన్ నగదు ఆపద సమయంలో ఎంతో ఉపయోగపడుతోంది. రోగాల బారిన పడిన బాధితులకు ఆపన్నహస్తంలా వారు ఎక్కడుంటే అక్కడికి వలంటీర్లు వెళ్లి ప్రభుత్వ సాయాన్ని అందిస్తున్నారు. శ్రీరామవరానికి చెందిన కొత్తపల్లి సరోజినికి తలకు సంబంధించిన అనారోగ్యంతో గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. వలంటీర్ కొత్తపల్లి జ్యోతి గుంటూరు వెళ్లి ఆమెకు పెన్షన్ నగదు అందించడంతో పాటు ఆమెకు వైద్యసేవలకు ఎంతో తోడ్పాటునందించారు.

ఆసుపత్రి ఖర్చులకు పింఛను నగదు



డబ్బులు లేక ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉండేది. నా ఏరియా వలంటీర్ కొత్తపల్లి జ్యోతి ఉదయమే తలుపు తట్టి పెన్షన్ నగదు అందజేసేది. తలకు సంబంధించి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నప్పుడు గుంటూరు వచ్చి పెన్షన్ అందించడంతో నాకు ఆసుపత్రి ఖర్చులకు కొంత తోడైంది. – కొత్తపల్లి సరోజిని, పెన్షనర్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు

పెదవేగి : నిత్యం గ్రంథ పఠనంతో చక్కటి విజ్ఞానం సంపాదించవచ్చని పెదవేగి శాఖా గ్రంథాలయం గ్రంథపాలకుడు తోట అరుణకుమార్ తెలిపారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథపాలకుడు అరుణ్‌కుమార్ చిన్నారులకు గ్రంథపఠనం ద్వారా కలిగే లాభాలను వివరించారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదవడం ద్వారా భవిష్యత్ ఉన్నతంగా మార్చుకునే వీలుంటుందని ఆయన చెప్పారు. గ్రంథాలయానికి రావడాన్ని అలవాటుగా మార్చుకుంటే గ్రంథపఠనం అలవడుతుందని ఆయన తెలిపారు. చక్కటి విజ్ఞానంతో ఉన్నత భవితకు బంగారు బాటలు వేసుకోవచ్చని అరుణ్‌కుమార్ వివరించారు.

పెద్దల అనుభవాలే చిన్నారుల ఉన్నతికి సోపానాలు

భీమడోలు: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని వక్తలు కొనియాడారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పుస్తక పఠనం చేసారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. బాల గంగాధర తిలక్ జయంతిని పుస్కరించుని ఆయన దేశానికి చేసిన సేవలను వివరించారు. ఏటా జూలై నాల్గవ ఆదివారం వచ్చే తల్లిదండ్రుల రోజు విశిష్టతను చిన్నారులకు తెలియజేసారు. చిన్నారులు కథలు, జీవిత చరిత్రలు, దినపత్రికలు చదివారు. పెద్దలు అనుభవంతో చెప్పే సూచనలను ప్రతి ఒక్కరూ పాటిస్తే ఉన్నత స్థితికి చేరుకుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు మోహనరావు, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమావేశం విజయవంతంపై హర్షం

దెందులూరు: జాతీయస్థాయి రేషన్ డీలర్ల మహాసదస్సు విజయవాడలో విజయవంతం కావడంపై రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి పోతునూరులో మండల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. రేషన్ డీలర్ల సంక్షేమం, అభివృద్ధి, భద్రత, భవిష్యత్తు దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రేషన్ డీలర్ల మహాసభలో రాష్ట్ర మంత్రి కారుమూరి డీలర్లపై వరాలు జల్లు కురిపించడం సంతోషంగా ఉందన్నారు. కమిషన్ పెంచడం, చనిపోయిన రేషన్ డీలర్లకు మట్టి ఖర్చు ఇస్తామని, మృతి చెందిన డీలర్ల కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని, సరుకుల్లో తరుగులు రాకుండా చర్యలు తీసుకుంటామని, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దే రేషన్ తీసుకునేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని, రేషన్ డీలర్లందరికీ ఎటువంటి సమస్యలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, మంత్రి కారుమూరి హామీ ఇవ్వడం రేషన్ డీలర్లందరికీ సంతోషంగా ఉందని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రేషన్ డీలర్ల రాష్ట్ర కమిటీ, ఏలూరు జిల్లా కమిటీ తరపున జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విజయవాడలో నిర్వహించిన రేషన్ డీలర్ల మహాసభకు విచ్చేసిన డీలర్లందరికీ, యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం



పెదవేగి జగనన్న కాలనీల్లో నీరు విడుదల చేస్తున్న ఎంపీపీ, స్థానిక మహిళలు

పెదవేగి : ఏళ్ల కాలంగా పెదవేగి ప్రజలను వేధిస్తున్న తాగునీటి సమస్య ఎంపీపీ చొరవతో పరిష్కారమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పెదవేగిలో తాగునీటి సమస్యపై పలుమార్లు సర్పంచ్‌కి విన్నవించినా పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో ఎంపీపీ తాతా రమ్యని గ్రామస్తులు ఆశ్రయించి జగనన్న, కొఠారు కాలనీలో తాగునీటి సమస్యపై లిఖితపూర్వంగా విన్నవించారు. ఎంపీపీ సమస్యను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి పెదవేగిలోని తాగునీటి సమస్యను తీర్చడానికి అవసరమైన పైప్ లైన్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ నిధులతో పనులు ప్రారంభించి పైప్‌లైన్లు పూర్తయ్యే వరకు ఎంపీపీ తాతా రమ్య పర్యవేక్షించారు. ఆదివారం నూతనంగా వేసిన తాగునీటి పైప్‌లైన్ పథకాన్ని కుళాయి వదిలి ప్రారంభించారు. దీనిపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, పెదవేగి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : మహిమ గల తల్లి రాట్నాలమ్మకు భక్తులు విశేష పూజలు చేశారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన అమ్మవారికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరివచ్చారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్లపై రూ.37,255, విరాళాలు రూ.3,863, ప్రసాదం విక్రయం ద్వారా రూ.31,200 మొత్తం రూ.72,318 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ తెలిపారు.

రాట్నాలమ్మ ఆలయానికి వెల్లువెత్తిన విరాళాలు

అమ్మవారికి దేవస్థానంలో శివాలయ నిర్మాణానికి హైదరాబాద్ వాస్తవ్యులు యలమంచిలి పండుబాబు, వాణిశ్రీ దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. అనంతరం ఏలూరు వాస్తవ్యులు ఆలపాటి రమేష్ మాధవి దంపతుల కుమార్తె చిరంజీవి సుష్మ రూ.లక్ష విరాళంగా అందించారు. దేవస్థాన చైర్మన్ చళ్ళగొళ్ల వెంకటేశ్వరరావు, సిబ్బంది దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి అభినందించారు.

500 మందికి నియామక పత్రాల అందజేత

దెందులూరు: వేగవరంలోని హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాలలో వైస్ ప్రెసిడెంట్, డాక్టర్ అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మందికి నియామక పత్రాలను సీఈఓ ఆర్. సౌజన్య, ప్రిన్సిపల్ డాక్టర్ డీ. మోహన్‌రెడ్డి అందజేశారు. ఆదివారం కళాశాలలో అరసవల్లి అరవింద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 60 మల్టీ నేషనల్ దిగ్గజ కంపెనీలు 3వేలకు పైగా ఉద్యోగాలకు మెగా జాబ్‌మేళా నిర్వహించారు. అర్హులైన వారిని 500 మందిని ఎంపిక చేసి వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ ఆర్.సౌజన్య మాట్లాడుతూ భవిష్యత్తులో నిరుద్యోగ యువతకు ఉపాధి, భద్రత, మహిళాభివృద్ధి లక్ష్యంగా మరిన్ని మెగా జాబ్‌మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కళాశాల ఏఓ కరుణానిధి మెగా జాబ్‌మేళా నిర్వహించి వందలాది మందికి బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించిన కళాశాల వైస్ ప్రెసిడెంట్ అరవింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే బోర్డు మెంబర్ తనిఖీతో తొలగిన బురద సమస్య

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం వద్ద నిర్మిస్తున్న అండర్ పాస్ పక్కన అత్యవసర ప్రయాణ మార్గాన్ని తనిఖీ చేయడంతో ఆరు గ్రామాల ప్రజలకు తాత్కాలికంగా సమస్య తొలగింది. ఇటీవల కేంద్ర రైల్వేబోర్డు రైల్వే జోనల్ యూజర్ కన్సల్టెన్సీ కౌన్సిల్ బోర్డు మెంబర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ అండర్‌పాస్ నిర్మాణ వద్ద మార్గాన్ని తనిఖీ చేశారు. దెందులూరు– అలుగులగూడెం వెళ్లే మార్గం కాలినడకకు కూడా వీలు లేని విధంగా నీరు నిలిచిపోవడం, నడిస్తే బురదతో జారిపడిపోవడం, అసలు వెళ్లలేని విధంగా తయారైంది. ఈ నేపథ్యంలో స్పందించిన రైల్వే కాంట్రాక్టర్ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా మోటారు పెట్టి బురద నీటిని బయటకు తోడుతున్నారు. ట్రాక్‌కు రెండు వైపులా నడవడానికి అసౌకర్యం లేకుండా నడిచివెళ్లేందుకు చర్యలు చేపట్టారు. రైల్వే ఉన్నతాధికారుల సైతం తరుచూ అండర్‌పాస్ నిర్మాణం, ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన మార్గానికి అసౌకర్యం లేకుండా తరుచూ తనిఖీలు చేయాలని ఆరు గ్రామాల ప్రజలు రైల్వే ఉన్నతాధికారులను కోరుతున్నారు.

విద్యార్థులను తల్లిదండ్రుల్లా ఆదరించాలి

చింతలపూడి : చింతలపూడి సమీకృత బాలికల వసతి గృహాన్ని, అంబేద్కర్ గురుకుల పాఠశాలలను సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్ ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. పిల్లలకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వసతి గృహ సిబ్బందిని, కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారా, నాణ్యమైన విద్యను బోధిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులపై సత్ప్రవర్తన కలిగి ఉండాలని, పిల్లలను తల్లిదండ్రుల్లా ఆదరించాలని సూచించారు. ఎలాంటి ఆరోపణలు రాకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు.

ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు అవసరం



స్కూలు నాయకత్వంపై నిర్వహించిన శిక్షణలో జేడీతోపాటు జిల్లా నుంచి హాజరైన ఏపీఎస్ఎస్ భాస్కర్‌కుమార్

భీమడోలు: పాఠశాలలకు కేంద్ర బిందువు అయిన ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు సాధించినట్లయితే పాఠశాల వ్యవస్థ బలోపేతమవుతుందని జిల్లా ఇన్‌చార్జి అకడమిక్ మోనటరింగ్ అధికారి, భీమడోలు ఎంఈవో–2 ఏఎస్‌వీఎస్ భాస్కర్ కుమార్ అన్నారు. ఆగిరిపల్లిలో ఏలూరు, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 190 మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్కూలు నాయకత్వంపై ఆరు రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారం సాయంత్రంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా నుంచి భాస్కరకుమార్ హాజరయ్యారు. అక్కడ చర్చించిన అంశాలను వివరించారు. ముగింపు సమావేశంలో సమగ్ర శిక్షాభియాన్ జేడీ బి.విజయభాస్కర్ శిక్షణ పొందిన హెచ్‌ఎంలకు దిశానిర్దేశం చేసారన్నారు. ఎస్ఎస్ఏ జిల్లా అకడమిక్ మోనటరింగ్ ఇన్‌చార్జి అధికారి భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ హెచ్‌ఎంలపై పాఠశాలలను పటిష్టపర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులను సమన్వయపర్చుకుని వారి ద్వారా చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేసి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. శిక్షణ తరగతులలో చాలా విషయాలను నేర్చుకున్నామని, నాయకత్వం విశిష్టతను, గొప్పదనాన్ని, ఏ విధంగా నాయకుడు ఉండాలో తెలియజేసారని భాస్కర్‌కుమార్ అన్నారు. అనంతరం గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారన్నారు.

నిధుల దుర్వినియోగం విచారణలో జాప్యం తగదు



దెందులూరు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు పార్టీ నాయకులు

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఘటనపై విచారణలో జాప్యం తగదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు అన్నారు. స్పందనలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ పంచాయతీ రికార్డులు తీసుకువెళ్లి పది రోజులైనా నిధుల దుర్వినియోగంపై నిజానిజాలు తేల్చకపోవడానికి ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఆదివారం దెందులూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు ఆధ్వర్యంలో ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు, దెందులూరు ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, ఎంపీటీసీ పులిపాటి ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు వాసు, తంబి సమావేశం నిర్వహించారు. టీడీపీ సర్పంచ్ నిధులు దుర్వినియోగానికి సంబంధించి కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని నిధులు దుర్వినియోగంపై నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. దెందులూరు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగానికి సంబంధించి గ్రామ, మండలస్థాయి అధికారులు ప్రజల ఆస్తులకు పరిరక్షకులుగా ఉండేలా తప్ప ఇలా ఆలస్యం చేయడం ఎందుకో తమకు అర్థం కావడం లేదన్నారు. జరిగిన అన్ని ఘటనలు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావులను కలిసి వివరించామన్నారు. టీడీపీ సర్పంచ్ నిధుల దుర్వినియోగం, విచారణలో ఆలస్యం జరుగుతుండటం, అంకితభావంతో పనిచేసే అధికారులపై అనుమానించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.

హైవేపై ప్రమాదంగా మారిన నాచుగుంట రేవు



జాతీయరహదారి నాచుగుంట రేవు క్రాసింగు సెంటర్

ఉంగుటూరు: జాతీయరహదారిపై నాచుగుంట రేవు క్రాసింగు పాయింటు ప్రమాదంగా మారింది. జాతీయ రహదారి నిర్మించినప్పటి నుంచి అనేక ప్రమాదాలు జరిగాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. కొంతమంది క్షత గాత్రులు అయ్యారు. ఈసెంటరులో జాతీయరహదారి నిర్మాణంలోనే డివైడరు ఓవైపు ఎత్తుగా ఉంది. మరోవైపు పల్లంగా రహదారి నిర్మించారు. దాంతో తాడేపల్లిగూడెం వైపు నుంచి నాచుగుంట రోడ్డులోకి వచ్చే వారు ఏట వాలుగా ఉండటంతో వేగానికి వాహనం జారిపోతుంది. డివైడర్‌ను క్రాస్ చేసే చోట వాహనాలు వచ్చే ఆచూకీ డివైడర్ వెడల్పుగా ఉండి, మొక్కలు పెరగడం కారణంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగంగా వచ్చిన వాహనాలు రోడ్డు క్రాస్ చేసేవారిని ఢీకొట్టిన ప్రమాదాలు ఎక్కువ. దాంతో ఈ సెంటరు ప్రమాదంగా మారింది. ఇక్కడ ప్రమాదాలు నివారణకు ఎస్సై స్వామి కృషి చేసి స్టాప్ బోర్డులు ఏర్పాటు చేయించారు. ఎస్సై స్వామి టోల్ ప్లాజా అధికార్లను అడగటంతో టోల్ ప్లాజా మేనేజరు నాచుగుంట డివైడరు వద్ద లైట్లు కూడా ఏర్పాటు చేయించారు. రాత్రి సమయాల్లో లైట్ల వెలుగు వాహనదార్లకు కనిపించేలా ఏర్పాటు చేశారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్) : వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం వద్ద వెలుగు వీవోఏల జిల్లా సమావేశం లక్ష్మీ రాధా అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. వీవోఏల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ నిర్మలాదేవి, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సుభాషిణి మాట్లాడుతూ వీవోఏలకు మహిళా మార్టులు పెనుభారంగా మారాయన్నారు. కోళ్లు, గొర్రెలు, మేకలు, గేదెలు ఇచ్చి అభివృద్ధి చేయాలని చిన్న సంఘాలపై ఒత్తిడి తెచ్చే విధంగా పనిచేయిస్తున్నారన్నారు. తాము ఆన్‌లైన్లో పనులను సొంత ఫోన్లలో చేస్తున్నామని అవి కూడా ఇప్పుడు హ్యాంగ్ అయిపోతున్నాయని కాబట్టి వీవోఏలకు ఫోన్లు ఇప్పించాలని కోరారు. పనిభారం తగ్గించాలని, తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా నాయకులు లక్ష్మి, సునీత, వి.నాగలక్ష్మి, జె.మేరీ, ఈ.జయ, వాణిశ్రీ పాల్గొన్నారు.

ఈ మలుపులు ప్రమాదాలకు పిలుపులు

- అదుపుతప్పితే అంతే సంగతులు
- కానరాని హెచ్చరిక బోర్డులు



కొండలరావులపాలెం వద్ద వై జంక్షన్



లక్ష్మీపురం సమీపంలోని మలుపు



వంగూరు వద్ద ప్రమాదకరంగా మలుపు

పెదవేగి : నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన మలుపులు ప్రమాదానికి నెలవుగా మారి నిత్యం ప్రయాణికులకు ఇబ్బంది కరంగా మారాయి. దీంతో నిత్యం ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిల్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ ప్ర మాదకర మలుపులు ప్రధానంగా పెదవేగి మండల పరిధిలోని జానంపేట, లక్ష్మీపురం, కొండలరావులపాలెం, గార్లమడుగు, దెందులూరు మండలంలో శ్రీరామవరం, ఉండ్రాజవరం, దెందులూరు శివారు, రామారావుగూడెం, అలుగులగూడెం–సానిగూడెం రహదారుల్లో, పెదపాడు మండలంలోని కొత్తూరు, పాతముప్పర్రు, పెదపాడు, తోటగూడెం, సత్యవోలు, గుడిపాడు, తదితర గ్రామాల్లోని మలుపులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. ఈ రహదారుల దగ్గర కొంత మంది అమాయకులు తీవ్రంగా గాయపడితే మరి కొంత మంది పాణాలను కబలిస్తూ మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. కనీసం ఈ ప్రమాదకర మలుపుల్లో హెచ్చరిక బోర్డును సైతం ఏర్పరచలేదని, ఈ రహదారుల్లో ప్రయాణం చేయాలంటే తమకు ముచ్చెమటలు పడుతున్నాయని, ఆయా మలుపుల వద్ద ప్రమాదాల అదుపునకు చర్యలు చేపట్టాలని ప్రజలు, బాధితులు అధికారులను కోరుతున్నారు.